వనితా లోకం:

# ఆమె అభిప్రాయం

## 1

రోజూ ఆఫీసు సాయంత్రానికే మూసేస్తారు! అయినా, కృష్ణమూర్తి ప్రతి దినం రాత్రి ఏ ఎనిమిది తొమ్మిది గంటలకో గాని ఇల్లుచేరడు. కనుకనే, ఆనాడు కను చీకటి వేళకే కృష్ణమూర్తి ఇంటిలో కాలు పెట్టగా, గొప్ప వింత చూడవచ్చినట్లు ఎదురొచ్చింది, లక్ష్మి! వచ్చి, మందహాసంతో సరసంగా "ఊరక రారు మహానుభావులు!" అని కూడా రాగవరసని అంది. అతనూ చిరునవ్వుతో కోటు తీసి ఆమె చేతికందిస్తూ "అవునవును! మా నాన్న ఇవ్వాళ చిన్న ఉత్తరమొకటి రాశాడు" అన్నాడు.

"చిత్రంగా వుందే! వేళకి ఇంటికి రానివారు వచ్చెయ్యడం - సాధారణంగా ఎవ్వరికీ జాబులు రాయని మామగారు, అందులో ఈ సుపుత్రుడికి ఉత్తరం వ్రాయడం - అంటే, ఏదో గొప్ప విశేషమే వుండాలి!"

"ఏమీ లేదు! అమ్మకి ఒంట్లో బాగో లేదట! ఒదినకి నిండు నెలట! ఇంటి పరిస్థితులూ ఏమీ సరిగా లేవట! ఏ వేళకి ఏం జరిగినా ఆదుకోనేవారే లేరట!" బూట్లు విప్పుకొంటూ వివరిస్తున్నాడతను.

అప్పటికే ఆమె జరుగనున్నది అర్థంచేసుకుంది. "కాబట్టి, నన్నొకసారి అక్కడికి పంపడం చాల మంచిదని మామగారు వ్రాశారు - అంతేనా?" అన్నది!

ఒకసారి తలెత్తి భార్యని చూచి, తిరిగి తలొంచుకొని "ఆఁ! ఎంత తొందరగా నిన్ను పంపితే అంత ఉత్తమంగా వుంటుందని వ్రాశారు!" అన్నాడు.

"అందుకని, నన్ను పంపితే మంచిదనే మీరూ నిశ్చయంచేసుకొని - ఆ వార్త ఎంత పెందరాళే చెప్తామా అని ఇలా పరుగెత్తుకొచ్చారు! అవునా?" అందామె. ఆమె కుశాగ్రబుద్ధి అతని కేమీ ఆనందం కలిగించలేకపోయింది!

కొంచెం కోపంగానే ముఖం చిట్లించుకొని "అవును, తొందరలోనే నీవు వెళ్లాల్సి వుంటుంది!" అన్నాడు.

"అలాగా! కాని, నేను వెళ్ళదల్చుకోలేదు!" అని లక్ష్మి నిష్కర్షగా చెప్పేసింది!.. కృష్ణమూర్తి నిర్ఘాంతపోయాడు.

"అదేమిటే, నిన్న మొన్నటిదాకా నీవేగా: నా ఒంట్లో ఏమీ బాగోడం లేదు, మీతో ఈ పిల్లల్తో వేగలేకపోతున్నానని కూడ, కొంతకాలం మా అమ్మ దగ్గరకో లేక అత్తయ్యవద్దకో పోతానంటూ పోరు పెట్టూ వచ్చావ్?" అని, చమత్కారంగా "ఏం? మామగారింటికి వెళ్లాల్సి వస్తుందని ఇలా గంటున్నావా, ఏమిటీ? పోనీ, మీ పుట్టింటికి పోగలవా?" అన్నాడు.

"ఎక్కడికీ వెళ్లను! నిన్న మొన్నటిదాకా వెళ్తానన్నానంటే - మరి నిన్న మొన్నటిదాకా నా మెళ్ళో నాను, నానులాగే వుంది మరి. ఇప్పుడేది? ఆ నగ తిరిగి నా మెళ్ళోకొచ్చేదాకా నేనీ గడపదాటి పోదల్చుకోలేదు! అంతే!" అని నిక్కచ్చిగా చెప్పి, ఆమె విసవిసా వంటింట్లోకి వెళ్ళిపోయింది!...

**కె. పి. బాబు**

క్షణకాలం కృష్ణమూర్తి గుండెపోటు వచ్చినంత పనయింది. అంతకు వేయింతలు బాధ అనుభవించాడు! ఆ బాధ అతనిలో క్రోధాన్ని ఇనుమడింపచేసింది! చరచర పోయి ఆమెతో "ఆహాఁ! అలాగా! అయితే నాకేం? రేపే మీ కోడలింతలో రాదల్చుకోవడం లేదట అని ఒక కార్డు ఆయనకి రాసి పారేస్తాను!" అంటూ వెళ్లిపోయాడు! లక్ష్మి బిత్తరపోయింది!...

* * *

ఇంతకీ ఆ 'నాను' సంగతేమిటంటే—

దీపావళి ముందొక నాడు తెలతెల్లవారొస్తోంది! గదిలో చీపురుతో నేల ఊడుస్తున్న శబ్దం విన్పిస్తున్నది! మంచంమీద పడుకొన్న కృష్ణమూర్తి కళ్లు తెరిచి చూచాడు కొద్దిగా! కన్ను తెరువకపోయినా రాత్రిఅంతా అతనికి నిద్ర లేనేలేదు!..

ప్రస్తుతం అతనికి డబ్బు అవసరమైంది! ఒకవంక, మిత్రుడొకడ్ని ప్రాణాపాయస్థితిలోనుండి కాపాడాలి; మరోవంక దీపావళి మీదకొస్తోంది! కాని నెలాఖరు రోజులు.. ఒకటో తారీఖునాటికైనా జీతానికి మించిన ఋణబాధ కన్పిస్తూనే వుంది! అతనిన్ని రోజులూ ఆ అప్పులు ఎలా సర్దుబాటు చేసుకురావాలా అనే ఆలోచిస్తూ వచ్చాడు.... ఉపాయం చిక్కలేదు సరిగదా, ఈ క్రొత్త అవసరాలొకటి హఠాత్తుగా మీదపడ్డాయి! మరి చిక్కైపోయింది! బంధుమిత్రుల్లో తనకి, అప్పు ఇవ్వకూడదనుకొనే వాళ్లెవ్వరూ వుండరు కాని, ఇవ్వగల్గేవారే కన్పించడం లేదు! ఇంట్లో భార్యాబిడ్డల తాలూకు నగానాణేలన్నీ ఎప్పుడో తుడిచివేశాడు...తనని అంతకన్నా ముంచే!..... మరిక ఎలాగు? ఎలాగో అంటూనే ఆ రాత్రిఅంతా కళ్లు మూసుకొని నిద్ర నటిస్తూ కాలక్షేపం చేశాడు! ..

ఇప్పుడు మళ్ళీ కళ్లు మూసుకొని, వెల్లకిలా పడుకొని, తలక్రింద చేతులుంచుకొని, దీర్ఘాలోచన ఆరంభించాడు!.. గది వూడుస్తూ లక్ష్మి క్రమంగా అతని మంచం చేరువకొచ్చింది. ఆమెకూడా ఏదో ఆలోచిస్తూ, వంగి ఎడం చెయ్యి నడుం వెనక్కి పెట్టుకొని, కుడిచెత్తో చీపురుతో నేల వూడుస్తూ అడుగులో అడుగు వేస్తూ కృష్ణమూర్తి మంచాన్ని సమీపించింది! .... ఊడ్పు చప్పుడు దగ్గరైనప్పుడు కృష్ణమూర్తి తిరిగి కళ్లు తెరిచి చూచాడు. ఆమె అప్పుడతనికి చాలదగ్గర్లో వుంది! వెల్తురు కూడా కొద్దికొద్దిగా కిటికీలగుండా గదిలోనికొస్తోంది!...

ఆమె ముఖం చాల గంభీరంగా వుంది. జుట్టు విచ్చలవిడిగా, కొంత ముఖంమీదా, కొంత మెడ కిరుపైపులా, మరికొంత వీపుమీదా పడ్తూ లేస్తూ అందంగా వుంది. దుస్తులుకూడా ఒక అదుపులజ్జల్లో లేనట్లుగా ఉన్నాయ్.

స్త్రీ సౌందర్యం - బాల్యం, యవ్వనం, ప్రౌఢం, వృద్ధాప్యం—వీనిలో ఎప్పుడు బలంగా ఆకర్షిస్తుందయ్యా అంటే - ప్రౌఢ వయస్సులోనే నిజంగాను- అనుకొన్నాడు కృష్ణమూర్తి ఆమెని చూస్తూ. అతనికి విపరీతంగా మోహం కలుగసాగింది. కాని అంతలోనే లక్ష్మి మెడలోనున్న బంగారు నానూ, నల్లపూసల గొలుసూ-వంగిన ఆమె మెడనుండి వేగా ఊగిసలాడ్తూ అతని కంటబడ్డాయ్! చివరికా సంసారంలో మిగిలిన బంగారమల్లా అది మాత్రమే!.. అవి కంటబడ్డంతోనే అతని మోహోద్రేకం కాస్తా మంచులా కరిగిపోయినట్లైంది! ఆ వెంటనే అమోఘమైన ఆలోచనలు ఏవేవో కల్గి అతని మనోవ్యథ చాల తీరిపోయినట్లనిపించింది!..

అంతే-మళ్లీ కన్ను మూసేసుకొని కృష్ణమూర్తి ఆలోచిస్తూ నిద్ర నటించాడు! లక్ష్మి ఇదేమీ గమనించని కారణంచేత, తన పని తాను చేసుకొని అవలికి వెళ్లిపోయింది!...

# ★ ఆమె అభిప్రాయం ★

అలవాటుప్రకారం ఉదయం ఏడు గంటలకి పాప వచ్చి కృష్ణమూర్తిని "నాన్నా లే! లే నాన్నా!" అని తట్టి లేపింది. మగత నిద్రలో లేవకుండానే "ఊఁ!" అని గట్టిగా మూల్గి బిర్రబిగిసి పండుకొన్నాడు!. ... పిలిచి, పిలిచి విసిగెత్తి వెళ్లిపోయిందాపిల్ల!.. ఎనిమిదిగంటల ప్రాంతంలో అమ్మ వేసిన పెసరట్లు పంచదార నంచుకొని తింటూ, ఎక్కడ చేతిలోని ప్లేటు క్రిందపడిపోతుందోనన్న భయంతో, చిత్రంగా నడుస్తూ చిట్టిబాబు వచ్చాడు! వచ్చి కృష్ణమూర్తిని "లే నాన్నా! లే! అమ్మ కాఫీకి రమ్మంటూంది నాన్నా! రా!" అని పిల్చాడు! కాని కృష్ణమూర్తి కదల్లేదు మెదల్లేదు! వాడు కాస్సేపు పిల్చి పిల్చి - తిరిగి తన తిండి ధ్యానంలో పడిపోయి, తిని, ప్లేటు మంచం క్రిందకు త్రోసేసి - పంచదార పాకం చేతులు ఒంటికి రాసుకొంటూ వెళ్లిపోయాడు!... తొమ్మిదిన్నరైంది! పెద్దబ్బాయి స్కూలుకిపోతూ ఆ గదిలోకి తొంగిచూచి కంగారుపడి "నాన్నా! ఇంకా లేవలేదూ? ఆఫీస్ టైం అయ్యింది నాన్నా - లే!" అంటూ వచ్చి లేపాడు కాని, అప్పటికీ కృష్ణమూర్తి కిమ్మనలేదు! ఇటునుండి అటు తిరిగి మంచాన్ని మరింత గట్టిగా కరచుకొని పండుకున్నాడు! . ఇంటావిడికి రిపోర్టు వెళ్లిపోయింది!

గాపీగా పనులన్నీ ముగించుకొని మరీ లక్ష్మి గదిలోకి వచ్చింది! సరసంగా భర్త మీద వొరిగి, అతని ముఖంలో ముఖంపెట్టి మందహాసంతో "ఏమండోయ్, లేవండీ! ఏమిటీ విశేషం!" అంది అప్పటికి అతను భారంగా కదిలి కళ్ళుతెరిచాడు! "ఏమిటి విశేషం? ఆఫీస్ టైం అయిపోయిందే! మీ రింకా నిద్రలేవలేదు" అన్నది తిరిగి. "రాత్రి నుండీ ఏమీ బాగాలేదు" అన్నాడు. "ఆ సంగతి మిమ్మల్ని చూస్తుంటేనే తెల్సిపోతూవుంది!" "నిజంగా, నా మనస్సేమీ బాగోలేదు లక్ష్మి!" అన్నాడతను. ఆమె నవ్వింది - "బాగానేవుంది కాని, ఎందుకండీ ఇంకా ఈ పిల్లచేష్టలు? ఎవరన్నా చూస్తే నవ్వుతారు, లేవండిక! అనవసరంగా ఆఫీసు ఎగ్గొట్టి ఏం లాభం సంపాదిస్తారండీ? లేవండీ!" అంటూ బలవంతాన లేపింది. ఆ సమయంలో తిరిగి అతని కళ్లని ఆమె మెడలోని ఆ బంగారు "నాను" ఆకర్షించింది!.. ఇంక తప్పదన్నట్లు లేచి, ముఖం కడిగి స్నానంచేశాడు! పెసరట్లూ, కాఫీ తెచ్చిపెట్టింది. "ఊహుఁ!" అని లేచి పోబోయాడతను.

"ఏమండీ?" అనడిగిందామె.

"నిజం - నాకేం బాగాలేదివ్వాళ!"

"ఏమి?"

"ఏముందీ? చాల అవసరం - డబ్బు!" అన్నాడు చాల సాధారణంగా! ఆమెకూడా నిర్వికారభావం నటించి, మందహాసంతో "అవునూ - ఇప్పుడది మనకు చాల అవసరమే, మరి! దీపావళీ దగ్గరకొస్తున్నది - పిల్లలకైనా బట్టలూ అవీ కొనాలిగా? ఎట్లాగూ ఆఫీసెగ్గొట్టారు - ఈ పెసరట్లు తిని, కాఫీ త్రాగి అలా ఊళ్లోపడి సంపాదించుకు రండీ!" అన్నది. అతనికి ఉక్రోషం, క్రోధం ఉబుక్కొచ్చాయ్! పళ్లు బిగపట్టి లేచి అవతలికి వెళ్లిపోయాడేగాని, లక్ష్మి కళ్లల్లో నీరు గిర్రున తిరిగిన సంగతి మాత్రం గుర్తించలేకపోయాడు!

అలా పోయి - తిరిగి తిరిగి భోజనంవేళకి 'ఉస్సూ'రంటూ ఇల్లుచేరుకున్నాడు కృష్ణమూర్తి! తిన్నగా తన గదిలోకిపోయి బట్టలైనా విప్పకుండానే వాలుకుర్చీలో, నీరసంగా పండుకొన్నాడు! ఆ వెంటనే పాప వచ్చి "రానాన్నా! అమ్మ భోజనానికి రమ్మంటూంది నాన్నా!" అంది. కృష్ణమూర్తి ఆ పిల్లని గుర్రుమని చూచాడు! బెల్లబోయి పాప పారిపోయింది లోనికి!

మరి కొంతసేపటికి లక్ష్మి వచ్చింది! "భోజనానికి లేవరూ!" అంది "ఊహుఁ! ఆకలిగాలేదు" అన్నాడు.

"ఓహో! చిక్కిన డబ్బుతో హాయిగా స్నేహితులతో కలిసి విందు లారగించి వచ్చారా?" అంది వికాసంలేని మందహాసంతో!

"అవునవును కాని, తమ రిక దయచేయండి!" అని గసురుకొన్నాడు

లక్ష్మి పోలేదు! అతని దగ్గరకుపోయి "నన్నేం చెయ్యమంటారో చెప్పరాదా? ఎందుకిలా ఏమీ బయట పెట్టకుండానే అలిగి ఏడిపిస్తారూ?" అంటూ బ్రతిమలాడింది

"నా కవసరమైంది దొరక్క నేను చస్తుంటే, మధ్య నీగోల ఒకటా? వెళ్ళు - వెళ్ళు!" అని ముఖం త్రిప్పేసుకొన్నాడతను!

"మీ కవసరమైంది మీకే చిక్కనప్పుడు, ఇక నాకేమి చిక్కుతుంది - చెప్పండీ?"

"ఆఁ! తల్చుకొంటే ఎన్నైనా చిక్కుతాయ్ లెద్దూ!"

"నాకా? ఇంకేమున్నాయనీ - వినుకంటే ఆ అరవంకీలూ, వడ్డాణాలూ, నాగరాలూ, నెక్లేసులూ, గొలుసులూ, గాజులూ అవీ—"

"చాల్చాలు! దండకం ఆరంభించావూ?"

"దండకమేముందండీ? వెనుక అవేవో నాల్గు బంగారానివి ఉన్నై కనుక, అవసరాలు గడుపుతూ వచ్చాయ్! చివరికి పిల్లల వస్తువులు సైతం ఆ మార్వాడీ పాల్జేశాం గదా! ఇంకేమున్నాయనీ!"

కృష్ణమూర్తి గభాల్న లేచి కూర్చొని "ఎందుకులేవూ? నిజంగా అవసరం తీర్చాలనుంటే ఆ నానులేదా? ఆ నల్లపూసల గొల్సులేదా?" అనేశాడు! .

కొయ్యబారిపోయింది లక్ష్మి! "ఏమిటీ? మీకేమన్నా మతిపోయిందా అవేం మాటలండీ?" అంది తేరుకొని.

"ఇదిగో, నాచేత ఎందు కనిపిస్తావ్ - నివ్వెందుకు బాధపడ్తావ్ గాని, అవతలికిపో! నా బాధేదో నేను పడ్తాను! ఊఁ! వెళ్లూ!" అని లేచి పచార్లు చేయ నారంభించాడు . కొంగుతో కన్నీ రద్దుకొంటూ అవతలికి వెళ్ళిపోయిం దామె!

ఆ రాత్రికికూడా కృష్ణమూర్తి ఇంట్లో భోజనం చేయలేదు!... మొదటి ఆట సినిమా ఒదిలిపెట్టిన అరగంటకి ఇల్లుచేరుకొన్నాడు. పిల్లలంతా నిద్రపోతున్నారు; కాని లక్ష్మి మాత్రం మేలుకొని వీధి గుమ్మంలోనే దిగులుగా కూర్చుంది! ఆమెను గమనించనట్లే,




తెలుగుజిల్లాలకు, హైదరాబాదు ఏజంట్లు:
శ్రీ సీతారాం జనరల్ స్టోర్సు
బెజవాడ, సికింద్రాబాదు

ఆమెను రాగానే లోనికి పోయాడతను అతన్ని వెంబడించి ఆమె లోనికివెళ్లింది! "ఏమండీ? భోజనం చెయ్యరూ?" అంటూ ఎంతో మృదువుగా పల్కింది. కాని కృష్ణ మూర్తి నిర్లక్ష్యమంగా మంచంమీద కూల బడ్తూ "అక్కర్లేదు" అన్నాడు!

లక్ష్మి భర్త కెన్నోవిధాల అతని ప్రవ ర్తన ఎంత అపహాస్యమైందో నచ్చచెప్ప డానికి ప్రయత్నించింది! కాని ససేమిరా కృష్ణమూర్తి లొంగలేదు! చేసేదేమీ లేక లక్ష్మి అతని మంచానికి చేరువలోనే నేల మీద కొంగు పర్చుకొని దుఃఖిస్తూ పండు కొన్నది!...

* * *

ఆ మరునాడు కూడా మూర్తి ఆఫీసుకి పోలేదు! కాఫీ త్రాగలేదు! భోజనం చేయ లేదు! . ఇంట్లోనే కాలుగాలిన పిల్లి లా పచార్లు చేస్తూ, పిచ్చివానిలా ఆలోచిస్తూ ఉండిపోయాడు!...

వంటగదిలో సామాన్లు సర్దుకొంటూ ఇక తుదినిర్ణయం చేసుకుంటున్నది లక్ష్మి! ప్రపంచం ఎంత పరివర్తన పొందుతున్నా నేటికీ సంఘంలో ఆడది అబలగానే, మగాడు పౌరుషంగానే ఉంటున్నారు! ఇప్పు డాయన ఆఫీసు ఎగ్గొట్టినా, రాజీ నామా ఇచ్చేసినా ముందు బాధపడేది, అర్ధాంగి ఐనందుకు తానేగదా! ఆయనకేం- ఒంటరిగా, హాయిగా ఎక్కడో ఒకచోట ఏదో ఒకవిధంగా జీవించగలడు! కాని, తానో, ఈ పిల్లలో! చివరికి ప్రకృతికూడా ఆడవాళ్ల నన్యాయంచేసింది! ఇక అటు అత్త మామలు - 'మా అబ్బాయికి నిద్రాహారాలు లేకుండా చేసి, మతిపోగొట్టి, ఉద్యోగమూ ఊడబీకించి, మానెత్తి నెక్కవచ్చావా?' అని ఎంత రభస చేస్తారు!. పోనీ, ఆయన కోరినట్లు ఇచ్చేస్తే - ఆయన్ని అన్నివిధాలా నాశనం చేసేస్తున్నా వంటారు! ఇప్పు డాయన్ని ఇలా వ్యతిరేకిస్తే - రేపు వాళ్లే, వాడు కోరినట్లుచేయక మా తల్లీ, మాకొంపకి చిచ్చు పుట్టించావే అంటారు! ఎన్ని చావులోగదా ఆడదానికి?. ఏది ఏమైనా ముందు తానొక నిశ్చయానికి రావడమన్నది అవసరమనిపించింది లక్ష్మికి!

అలాగే ఆలోచించి భర్తని సమీపిం చింది!. అవును గాని, తమ కెంతో మంది గొప్ప గొప్ప మిత్రులూ బంధువులూ ఉన్నా రని చెప్తుంటారే!- మరి ఈ కాస్తంత అవ సరం గడవడానికి ఒక ఆడదాని నానే కావలసివస్తుందంటే, చాల ఆశ్చర్యంగా వుందండీ?"

లక్ష్మి మాటలలోని వ్యంగ్యాన్ని అర్థం చేసుకొనే స్థితిలోలేడతను! అతని ధ్యాసే వేరుగావుంది. పెళ్లాం మెళ్లో నానైనాసరే తాకట్టు పెట్టి, అవతల బాధపడుతున్న ఆ మిత్రు నికి సాయపడి 'సెభాష్! ఆదర్శమిత్రుడు - త్యాగమూర్తి' అన్పించుకోవాలి! అంతే... "ఆఁ! ఇప్పుడా రామూగాడి గతేమయ్యిం దేమిటి? వాడి సంగీతానికి మైమర్చిపోయి, తింటే గారెలు తినాలి వింటే రామూ సంగీ తమే వినాలని వేదికలెక్కి లెక్చర్లిచ్చిన వారు సైతం వాడి దరిద్రాన్ని పోగొట్ట ప్రయత్నం చేయరు చివరికిప్పుడు వాడి ప్రాణంమీదకొచ్చినా ఆదుకొనే దాత కన్పించలేదు! అంతే, ఎవరి సంగతైనా?" అంటూ నిట్టూర్చి "పాపం! వాడి పెళ్లాం, నిండా ఇరవేయ్యే ళ్లుండవ్ - వరి బేలమనిషిగదా! ఊరికే కంగారు తినేస్తూవుంది" అని కృష్ణమూర్తి చాల హృదయవిదారకంగా వర్ణించాడు!

"అయ్యో పాపం! అటువంటి వాళ్లకి చేతనైన సాయంచేసి తీరాల్సిందేకాని, ఏ భారత స్త్రీ కూడా తన మాంగల్యాన్ని తన బొందిలో ఊపిరివుండగా తీయలేదుగదా - మీకు తెలియనిదా?" అన్నది లక్ష్మి మెల్లగా! కాని, కృష్ణమూర్తి వికటంగా నవ్వి "ఏ భారతీయుడు కూడా తన మిత్రు నికి ప్రాణంమీదకొస్తే చూస్తూ ధర్మ పన్నాలు పల్కుతూ నిశ్చింతగా కూర్చో గలడా? అదీగాక, మీ పవిత్ర మాంగల్యాలు ఎవరి? అక్కర్లేదు - వాటిని మీవద్దనే భద్ర పర్చుకొని ఆ బంగారు నానుత్రాడు మాత్రం ఇమ్మని కోరుతున్నాను - తెలుసా?" అన్నాడు

"భర్త ప్రాణంమీదికొస్తే ఆ బంగారు నానుత్రాడునేకాదు, తన పవిత్ర మాంగ ల్యాన్ని సైతం ధారపోయడాని




# ★ ఆమె అభిప్రాయం ★

కాంతత్తయైనా సిద్ధంగానే వుంటుంది మరి - ఆ రమాగారి భార్యామణి ఏం చెప్తున్నట్లు?' అంది లక్ష్మి సూటిగా!

కృష్ణమూర్తి కొంచెం తొట్రుపడినా, వెంటనే తేరుకొన్నాడు - "నీవిస్తే ఇవ్వు! లేకుంటే లేదు - అంతేగాని అల్పబుద్ధిలో తేలికమాట లాడకు" అంటూ గద్దించాడు!

లక్ష్మికి భర్త ధోరణి బాగా బాధ కల్గించింది! "నేను అల్పబుద్ధిదాన్నే. నేను తేలిగ్గానే మాట్లాడుతాను - ఇన్నీ తెలిసీ నన్నే అడుగుతా రెందుకూ? మీ చెల్లెలుగారు ఆదర్శప్రాయులూ, సంస్కార హృదయులూ గదా - పోనీ, ఆమె నడిగి ఓ చిన్న నగ తెచ్చుకోరాదా? ఏమండీ?" అనేసింది!.. . కృష్ణమూర్తి పెద్ద చెల్లెలు ఆ వూర్లోనే కాపురం చేస్తోంది! .

భార్య మాట లతనికి ఉద్రేకం కల్గించాయ్! "ఏమిటే వాగుతున్నావ్? మళ్ళా వాగు చెప్తాను!' అంటూ లేచాడు. సహోద్రేకంతో లక్ష్మి తిరిగి సూటిగా చెప్పింది! వెంటనే ఆమె గూబ 'గుయ్' మనిపించి, కృష్ణమూర్తి గిర్రున తిరిగి బయటికి వెళ్లిపోయాడు!. .

తిరిగి కనుచీకటివేళకి ఇల్లు చేరాడు. పిల్లలు ఇంకా వీధిలో ఆటలాడుకొంటున్నారు! లక్ష్మిని వెతుకులాడ్తూ లోనికి పోయాడతను ఆమె లోన తన పూజాస్థానంలో కూర్చుని, బహునిష్ఠతో, శ్రద్ధగా దేవుళ్లని ఆరాధిస్తోంది! ఆమె ముందు పూజాపీఠంపైన దీపాల వెలుగులో మెరిసిపోతూ ఆమె బంగారు నాను కన్పిస్తోంది! . నిశ్శబ్దంగా దగ్గరచేరి అదంతా చూస్తూ నిల్చుండిపోయాడు కృష్ణమూర్తి కాని, లక్ష్మి అతని రాక నెలా పసికట్టిందో ఏమోగాని, చటుక్కున లేచి, ఆ నగ తీసి మౌనంగా భద్రంగా భర్తచేతుల కందించింది!

అప్పుడామె గంభీరమైన ముఖం ముకుళించుకొనివుంది! ఆమె అందమైన కండ్లు ఏడుస్తున్నై. ఆమె చక్కని పెదాలు వణికిపోతున్నాయ్! ఆమె మెడలో పసుపుత్రాడు క్రొత్తగా చక్కగా కన్పిస్తూవుంది!..

ఇదంతా చూచాడతను! చటుక్కున తలొంచుకొని ఆ నగని పంట్లాం జేబులో భద్రపర్చుకొని బయటకి వెళ్లిపోయాడు!

మళ్ళీ ఇలుచేరేసరికి తొమ్మిదిదాట్తోంది! పిల్లలంతా గాఢనిద్రలో వున్నారు! లక్ష్మి వచ్చి తలుపు తీసి తనగదిలోకి పోయి పడుకొన్నది.. మూర్తి మెల్లగా తన గదిలోకి పోయి మంచంమీద పండుకొని, చాలసేపు అటు ఇటు పొర్లాడు, కాని - అతనికి నిద్ర పట్టేట్లు తోచలేదు!.. కొంతసేపు ఆలోచించి, ఆలోచించి లేచాడు మెల్లగా లక్ష్మి దగ్గరకు వెళ్ళాడు! ఆమెగోడవైపుకి తిరిగి పండుకొని ఇంకా ఆవేదనతో ఆలోచిస్తూ వుంది! భర్త కరస్పర్శకు తలత్రిప్పి చూచింది! ఆమె చూపు లతి జాలికరంగా వుండి, అతని కళ్ళకు మాత్రం వాడిపూవుల్లా కన్పించాయ్!. ఆమెపైకి వంగి, ఆప్యాయంగా భుజం తట్టూ, మందహాసంతో "లే!" అన్నాడు "ఎందుకూ?" అందామె చిరాగ్గా "ఉస్! లేచిరా! చెప్తానుగా" అన్నాడు. "ఊహూఁ!" అందామె "ఊహుఁ! రావాలి!" అని మళ్లీ తట్టాడు. రానని బిర్రబిగిసిందామె! "మర్యాదగా వస్తావా, లేక ఎత్తుకొని పోవాలా?" అన్నాడు నవ్వుతూ. అభిమానంతో "ఊహుఁ నాకేం బాగాలే దివ్వాళ!" అని విదిలించుకొందామె! కాని, మూర్తి వదిలిపోలేదు! "అవునూ - ఇలా వుంటే ఏమీ బాగోదు! అందుకే అలా పోదాం రా! ఊఁ!" అంటూనే తమాషాగా కితకితలు పెట్టి ఆమెను లేవనెత్తుకొన్నాడు! దానితో ఆమె తేలికైపోయి అతని బాహువుల్లో వాలిపోయింది!

## 2

దీపావళి వచ్చింది .వెళ్లింది! ఒకటో తారీఖు వచ్చింది వెళ్లిపోయింది! కాని, అనుకొన్నవిధంగా లక్ష్మి నగ తాకట్టునుండి ఆమెను చేరనేలేదు! కృష్ణమూర్తి మాత్రం యథావిధిగా తన వ్యాపకాలు - నాటకాలు, సినిమాలూ - మిత్రులు, పత్రికలకు తన సంపాదన వెచ్చిస్తూనే వస్తున్నాడు! . ఈ వ్యవహారమిక ఇట్లా తేలదనుకొనే ఆమె తన మెడలో ఆనగలేనిదే ఆ యింటి గడప దాటిపోనని పట్టుబట్టింది! కాని, ఏంలాభం ఆయన వెళ్లమన్నా తానే పోనన్నట్లుగా సృష్టించి మామగార్కి ఉత్తరం వ్రాస్తారట! ఆలస్యం చేస్తే అంతపని చేసేస్తారు కూడా! కాని, అది ఎంత ప్రమాదం తెస్తుంది!.. అత్తగారికి ఒంట్లో బాగోలేదని రమ్మంటే రాలేదని ఆమె ఏమైనా చేస్తుంది గదా! తనకు నెలలునిండి పిల్లా పీచులో నానా అవస్థా పడ్తుంటే సహాయం రాలేదని తెలిసి తోటికోడ లెంత బాధపడ్తుంది! బావగా రెంత ఆగ్రహిస్తారు! ఇంతకీ తన మాట త్రోసివేసినందుకు మామగా రింక తన ముఖం చూస్తారా?

ఇంతకీ మగవాళ్లేమిచేయడానికైనా వీలుంటుంది! వాళ్లేమిచేసినా చక్కగానే ఉంటుంది - అనుకొని నిట్టూరుస్తూ, తానొక ఇంటికోడలి నన్న సంగతి స్ఫురణకి తెచ్చుకొని లక్ష్మి స్వయంగా భర్తని పిల్చింది! "మంచిరోజు చూడండి-" అని నసిగింది!... ఆగలేక పకపక నవ్వాడతను! ఇక ఆమెకు కోపం పట్ట శక్యంకాలేదు - "నవ్వండి! అవును మరి, చేసేది ఒకరైతే అనుభవించేది మరొకరు గదా! మరి నవ్వరా దూ? నవ్వండీ!" అంటూ లోనికిపోయింది! పాపం - కృష్ణమూర్తికి జాలికల్గినా నవ్వాగలేదు!

* * *

అత్తగారిల్లు చేరుకొన్న తరువాత అత్తమామలకి ఆమె నానుసంగతి తెల్సిపోయింది. వెంటనే ఒకవంక మామగారు మెల్లగానూ, మరోవంక అత్తగారు గట్టిగానూ లక్ష్మిని చీవాట్లు పెట్టారు "వాడొట్టి వెదవ అని తెల్సుగదా, తెలిసీ తిరిగి ఆ కొత్త బంగారం అప్పగించి వచ్చావూ? అందులో అటువంటి వస్తువు ప్రాణం పోయినా మెడనుండి తీయవచ్చునా? ఏళ్లు రాగానే సరిగాదమ్మా, సంసార బాధ్యతా, కుటుంబ నిర్వహణా తెల్సుకోవాలి! మగాళ్ళు చెడిపోవడానికి ముఖ్యం అర్ధాంగులే సుమా!" అంటూ నానామాటలూ అన్నారు అంతటితో ఆగక - లక్ష్మి పుట్టింటికికూడా ఉత్తరం ద్వారా తెలియజేసి ఆమెకు వాళ్లమ్మానాన్నల వద్దనుండికూడా నాలు మందలింపులు తెప్పించారు! . లక్ష్మితోటికోడలు మంగతాయారమ్మకు ముగ్గురుపిల్లలు! తిరిగి ఎనిమిదో నెల! ఎముకల ప్రోవులా, నలభైఏళ్ల దానిలా నీరసంగానూ భయంగానూ ఎదురయ్యింది లక్ష్మికి! "లక్ష్మీ! నీవింకా నాలు రోజు లాలస్యంగా వచ్చివుంటే, నాకూ సేవ చేయాల్సి వచ్చునేమో చెల్లీ!" అంటూ ఆమె నవ్వుతూనే అన్నా లక్ష్మికి చాల జాలికల్గింది! అంతవరకూ ఆ యింట్లో చాకిరి చేయలేకా, తన బాధ వెలిబుచ్చుకోలేకా, మంగమ్మ సతమతమై పోతున్నదని కూడా లక్ష్మి గుర్తించింది! అంతేకాదు, మంగమ్మ అంతవరకూ వహిస్తూవచ్చిన భారాన్నంతా ఇక తానే భరించాల్సి వుంటుందనీ లక్ష్మి తెల్సుకున్నది..

ఇక ఏమనుకోవాలో, ఏమి చేయాలో, ఏమి చెప్పుకోవాలో ఏమీ బోధపడక విస్తుపోయింది లక్ష్మి!...

* * *

ఏలూరునుండి కాంతమ్మ పుట్టింటికి వచ్చింది. లక్ష్మి కామె ఆప్తురాలు! కనుక, ఒకసారి పరామర్శచేసి వద్దామని ఒకనాటి సాయంత్రం కాంతమ్మ వెంకటరావుగారింటికి వెళ్లింది

ఆ యింటిబయట చిన్న కారు నిలచివుంది! అందులో - కాంతమ్మకి దూరపు బంధువు లబ్బాయీ, వెంకటరావుగారి కుటుంబ మిత్రుడూ అయిన మోహన్ స్టీరింగ్ వద్ద కులాసాగా కూర్చునివున్నాడు. "ఎప్పుడు రాక అక్కయ్యగారూ? పిల్లా

ఇల్లా అంతా క్షేమమా? ఏమిటి విశేషాలూ?" అని చిరునవ్వుతో పల్కరించాడు ఆమె కూడా నవ్వి "ఆ-ఆ! మీ దయవల్ల అంతా క్షేమమే నాయనా! నేను మొన్ననే వచ్చాను కాని—అమ్మా నాన్నా అంతా బాగున్నారా బాబూ?" అంది "అహా!" అన్నాడా యువకుడు "అయితే, వేళ గాని వేళ ఇక్కడ మకాం వేశావ్, ఏమిటి విశేషం బాబూ?!" అనడిగింది "అబ్బే! మరేంలేదు - సరోజ వస్తానంది! సినిమాకు పోదామని!" అన్నాడు శాంతమ్మ "అలాగా - బాగుంది నాయనా! మంచిది!" అంటూ యింట్లోకి వెళ్లింది

ఇంట్లో ముందుగదిలో వెంకట్రావుగారి చిన్నమ్మాయి సరోజ నిలువుటద్దం ముందు నిలబడి టాయ్‌లెట్ అవుతూవుంది! ఆమె చెంత నే నిలబడి ఆమెకవీ ఇవీ అందిస్తున్నాడు చిట్టిబాబు "ఒరేయ్, ఈ తిలకం సీసా భద్రంగా అందులో పెట్టి, ఆ కాటుక భరిణ ఇలా అందివ్వు! ఊఁ! త్వరగా!" అని ఆమె ఆజ్ఞాపిస్తుండగా శాంతమ్మ అక్కడికి వచ్చింది! ఆమెని చూచి సరోజ మందహాసంతో "రా ఒదినా," అంటూ ఆహ్వానించింది! శాంతమ్మ లోనికి వస్తూనే "ఏమిటో హడావుడీ?" అనడిగింది "ఏమీ లేదు! నీవు వచ్చావని నిన్ననే తెల్సింది! ఒదినకు తీరిక చిక్కలేదు కాబోలు, లేకపోతే తానే నీదగ్గర కొచ్చేది!"

"ఏదీ, లక్ష్మి ఎక్కడుందీ, కన్పించదేం?" అనడిగింది శాంతమ్మ సరోజ వ్యంగ్యంగా "ఎక్కడేమిటి? ఆమె స్థానంలోనే వుండి వుంటుంది!" అంది శాంతమ్మ తెల్లబోయి చూస్తూ "అదేమిటే - స్నానమేమిటి సంధ్యేమిటి నా ముఖం?" అనడిగింది సరోజ నవ్వుతూ "అదీ నేనే విడమర్చి చెప్తే బాగోదు వదినా!" అని, చిట్టిబాబుతో "ఒరేయ్! మా అమ్మ - ఇప్పు డెక్కడుందో మీ పెద్దమ్మకి చెప్పరా!" అన్నది వాడో సారి ఆమెనీ, మరోసారి శాంతమ్మనీ చూచి, అమాయకంగా చేతులూపుతూ "మరే - మరి - అమ్మ? ఇప్పుడూ వంటింట్లో వుంటుంది, కాదత్తమ్మా?!" అన్నాడు! "రైట్ - రైట్!" అని సరోజ అనేసరికి బయటినుండి కారు హారన్ శబ్దం విన్పించింది! అది వినబడగానే సరోజ ఆత్రంతో కాళ్లకి చెప్పులు తొడుక్కుంటూ, "వస్తానొదినా! మళ్ళీ కల్సుకొందాం! ఏం?" అంటూనే వెళ్లిపోయింది!

తిరిగి కారు బయల్దేరిన చప్పుడికిగాని, శాంతమ్మ స్పృహలోకి రాలేదు! చిట్టిబాబు చనువుగా ఆమె కొంగుపట్టుకొని "రా - పెద్దమ్మా! అమ్మ అదిగో - వంటింట్లో అన్నం వండుతూ, కూరలు తరుగుతోంది - రా చూద్దువ్ గాని!" అంటూ లాగుతున్నాడు.





# నాలుగు ఔషధములు ఒకట్లో

అనాసిన్, త్వరితముగా బాధల నుండి నివారణ ఇచ్చునట్టి, ఒక విజ్ఞాన సూత్రం ఎందుకనగా అది క్రింది ఔషధముల కలియకచేత ..

1 క్వినైన్ అధిక శక్తి నిచ్చు ఔషధమని మరియు జ్వరనివారణియని ప్రఖ్యాతిగాంచిన ఔషధ నమ్మేలనం జ్వరాన్ని తగ్గించడంలో సాటి లేనిది.

2 కఫీన్ బలహీనానికి మరియు చిక్కిపోయి నందులకు తగిన ఔషధమని విరివిగా వాడబడు చున్నది

3 ఫినాసిటిన్ : తీవ్రమైన బాధా నివారణి మరియు జ్వర నివారణియని ఖ్యాతిచెందినది.

4 అసిటైల్ సాలిసిలిక్ ఆసిడ్ · ఇది తలనొప్పి, మరియు అలాటి వివిధ బాధలను పోగొట్టుటకు ఉపయోగబడుచున్నది.

వైద్యశాస్త్ర రీత్యా లేక నమ్మేలన శక్తిచేత అనాసిన్ సూత్రం, త్వరితంగాను, నిరపాయంగాను, దృఢంగాను, బాధలనుండి, తలనొప్పి, జలుబు జ్వరం, దంతపు పోట్లు, కండరముల పోట్లు, వాయువు నొప్పులు మొదలగుబాధలను నివారించును.

2 మాత్రలుగల పాకెటులందును. మరియు 32 మాత్రలు గల అవహారించలేని డబ్బాలందును దొరకును

ఎల్లప్పుడును అనాసిన్ బిళ్లలే కావలెననికోరండి

# ★ ఆమె అభిప్రాయం ★

పాపని ఎత్తుకొని ముద్దాడి ముందుకు నడిచింది, శాంతమ్మ.

*    *    *

లక్ష్మి అత్తగారికి ఉబ్బసం తిరగబెట్టింది! ఆ సమయంలోనే మంగమ్మ ప్రసవమైంది! ఇటు అత్తగారికీ, అటు తోటికోడలికి లక్ష్మి రేయింబవళ్లూ సేవచేయాల్సి వచ్చింది! ఆమె అక్కడున్నందువల్ల తిరిగి తల్లిదండ్రుల కార్థికంగా ఇబ్బంది ఏమో అని, కృష్ణమూర్తి నెలనెలా జీతం అందగానే కొంత డబ్బు పంపుతూ వచ్చాడు! అందువల్ల ఆ కుటుంబ పరిస్థితి మెరుగైందేమోగాని, ఆమె స్థితిమాత్రం చాల అధ్వాన్నమైపోయింది! ఇటు తన పిల్లలు, అటు తోటికోడలి పిల్లలు వాళ్లందర్నీ చక్కబెట్టుకొనిరావాలి! కాగా, మామగార్కిగాని, బావగార్కిగాని, ఆడబిడ్డకిగాని, ఎంతమాత్రం లోటు జరుగరాదు! జరిగితే ఎవ్వరూ సహించే బాపతు కాదు! వారందరికీ ఏవేళకి ఏమికావాలో అవన్నీ - ఒక్క పనిమనిషి సాయంతోనే - తానొక్కతే సర్దుబాటు చేసుకురావలసి వచ్చేంది! అంత చేసినా ఎవరికీ తృప్తికలుగదు! ఎప్పుడూ ఎత్తిపొడుపులూ, ఎగతాళులూ! లక్ష్మి పైకి అన్నీ సహించుకొంటూ లోలోన చింతించే బాపతు మనిషి - కనుక చాలత్వరగా మనిషి క్షీణించి పోసాగింది!...

శాంతమ్మ వచ్చేసరికి - వంటగదిల్లో పుల్లలు సరిగ్గా మండక తిప్పలు పెట్టూవుంటే, వాటిని సరిచేసుకొంటూ, కూరలు తరుక్కొంటూ, మాసినబట్టలతో, చెదరిన జుట్టుతో, ఎర్ర బడ్డకళ్లతో ఏదో ధ్యాసలో వుంది లక్ష్మి! ఆమెని చూచి శాంతమ్మ తెగాలు పడిపోయింది! "ఏమేవ్ - నేనొచ్చానే!" అంది మందస్వరాన లక్ష్మి తలెత్తి చూచి, విస్మయానందాలతో లేచి ముక్కాలిపీట వేస్తూ "రా - రా - కూర్చో" అంది—

కూర్చుంటూ శాంతమ్మ "ఇదేమిటే ఇలాగైపోయావ్? బొత్తిగా ఆనమాలు కట్టలేనంత ఇదిగా మారిపోయావ్?" అంది

లక్ష్మి నవ్వుతూ "ఏం, నాకేమే? ఏరా చిట్టీ, బాగాలేనురా!" అనడిగింది! వాడు తలాడిస్తూ "ఊహుఁ! ఇక్కడేం బాగోడం లేదు! అక్కడే ఎంతో బాగుండేది!' అనే వాడు! లక్ష్మి నవ్వుతోనే గద్దిస్తూ ఊరుకో వెధవా! ఎవరన్నా వింటే ఏమనుకొంటార్రా? మంచిబుద్ధులే అబ్బుతున్నాయిలే, చివరికి! అంది!

కొంతసేపు ఆమాటా - ఈమాటా చెప్పకొన్న తరువాత మాటమీద మాట వచ్చి శాంతమ్మ "అవున్లే! నీవిలాగై పోవడం చూచీ ఒదలి ఎలాపోయాడే కృష్ణమూర్తి?" అనడింది! "నే నిప్పుడెట్లాగున్నానో ఆయనకేమి తెలుసూ?" అంది లక్ష్మి. శాంతమ్మ నివ్వెరపోయి "అదేమిటే - మొన్న మొన్ననేగా ఒక డజనుమంది మగాళ్లు, అరడజను మంది ఆడాళ్ళు - కెమేరాలూ సంగీతవాయిద్యాలూ, పళ్లూ ఫలహారాలతో అట్టహాసంగా కోల్లేరు చూడ్డానికని వచ్చారు? ఆ బృందానికి నాయకుడు మన కృష్ణమూర్తే గదా! ఏలూర్లో మా ఇంట్లోనే బసదిగారు! అంతా నాటకం సజ్జులాగున్నారు! వచ్చేటప్పుడు వీలుకలుగలేదనీ, వెళ్లేటప్పుడు మాత్రం తప్పకుండా ఇక్కడ దిగుతాననీ కృష్ణమూర్తి చెప్పాడే! దిగనే లేదా? అరె!" అంది లక్ష్మి గాఢంగా నిట్టూర్చింది! కొన్ని క్షణాలాగి అప్రయత్నంగా "అయితే ఆ నానూ తాకట్టునుంచి అక్కకానికి వెళ్ళిపోయుంటుంది!" అనేసింది! "నానేమిటే? అరె అదెలాగిచ్చావే?"

"నీవుకూడా అలాగే అంటున్నావా?" అంది అగోలా లక్ష్మి! శాంతమ్మ నాలిక్కరుచుకొనేలోగానే లక్ష్మికళ్లలో అశ్రువులు నిండాయి

*    *    *

కృష్ణమూర్తి అందంగా ఉండేవాడు! ప్రపంచ రాజకీయాలపైన వ్యాసాలు వ్రాస్తూండేవాడు! సాంఘిక సమస్యల గురించిన నాటకాల్లో పాల్గొనేవాడు! అందరిలో ఎంతో మంచివాడు అన్పించుకొనేవాడు! కట్నం పుచ్చుకోకుంటే ఎంత ఆదర్శప్రాయుడు దొరికాడో అని మురిసిపోయింది లక్ష్మి, పెళ్లి రోజుల్లో! కాని, పెళ్లైపోయాక కొన్ని వేల రూపాయిల ఆమె స్వంత నగలు క్రమేణా అతని స్వార్థానికి హరించుకుపోయాయ్! ఉదార హృదయుడుగా పేరుప్రతిష్ఠలు గడించే నిమిత్తమే - విరివిగా అనాథులకూ, నిస్సహాయ స్థితిలోనున్న బంధుమిత్రులకూ, తన స్వంత వ్యాపకాలక్కీ వెచ్చిస్తూవచ్చాడు! సంసారం అవిసంగా గుల్లైపోయాక, పొట్ట చేత్తో పట్టుకొని ఉద్యోగంలో ప్రవేశించికూడా అతనా అలౌక్యపు పద్ధతులు వదల్లేదు!

తనపై ఆధారపడేవున్న భార్యాబిడ్డల బాగోగులు చూడలేని వాడెంత కీర్తి గడిస్తేనేమి, ఎన్ని ఘనకార్యాలు సాధిస్తే నేమి? ఇంటిలో ఈగల మోత, ఊళ్లో పల్లకీల మోతా? బయటప్రపంచంలో నాగరికులుగా ఆదర్శప్రాయులుగా, స్త్రీ స్వాతంత్ర్యాభిలాషులుగా, సాంఘిక విప్లవకారులుగా చలామణీ అయ్యేవాళ్లంతా ఇంతేనా? లేకుంటే - వీరి ఆదర్శం, వీరి సంస్కారం స్వంత సోదరీమణులపైనా, పరాయి అభిమాన స్త్రీలపైనా తప్ప - కష్టనష్టాల్లో యావజ్జీవితం బాధ్యత వహిస్తూ, స్వంత మనస్సనేది లేకుండా మనసారా అనుసరించి వచ్చే అర్థాంగులపట్ల వర్తించవేం?" అంది శాంతమ్మ చిత్రమేమంటే - అది లక్ష్మికి కూడా బాధాకరమైంది!...

## 3

సంక్రాంతిసంభ్రమంగా వచ్చేస్తున్నది!..

వెంకటరావుగారి పెద్దమ్మాయి పెళ్ళయ్యాక అదే ప్రథమసంక్రాంతి! ముందు ముందేమిచేసినా చేయలేకపోయినా మొదటి సంక్రాంతికైనా క్రొత్తల్లుడినీ, కూతుర్నీ ఆహ్వానించాలిగదా - కాని, ఎట్లాగూ? నెలనెలకీ లెఖ్ఖ తగ్గించి పంపుతూ వచ్చిన చిన్నబ్బాయ్ ఆ నెల అసలు దమ్మిడీకూడా పంపలేదు! ఇక ఉత్తరాలు వ్రాసీ లాభం లేదతనితో, అని వెంకటరావుగారికి అనుభవం కనుక, నిస్పృహ వహించి ఊరుకున్నారు! పెద్దబ్బాయి తన పెళ్లాం పిల్లలకి కావలసిన బట్టలూ అవి కొనడానికే చేతిలో వున్న డబ్బు చాలక తికమకపడ్తున్నాడు! పంతులమ్మైన చిన్నమ్మాయ్ తనదగ్గరున్న డబ్బు ఇంటి అవసరాలకి ఖర్చుపెట్టాల్సి వస్తుందన్న భయంతో ముందే పండుగ కేదో క్రొత్తనగకి ఆర్డరిచ్చేసింది, చప్ చుప్ గా!

ఇక ఇంటావిడకి దడపట్టుకొంది! మునలాయన కొచ్చేదీ చిన్నబ్బాయ్ పంపేదీ కలిపి - ఆ పండుగకి క్రొత్తల్లుడిని పిలిచి ఎలాగో పండుగ గడిపివేయాలని ఆ వృద్ధ దంపతు లూహిస్తూవచ్చారు కాని కృష్ణమూర్తి ఇహంకన్న పరమే ముఖ్యంగా భావించేటటువంటి వ్యక్తిగనుక, ఇంకే మిత్రుడో ఆ సంక్రాంతి జరుపుకొనడానికి బాధపడ్తుంటే చూచి, తనదగ్గరున్నది కాస్తా గొప్పకి సమర్పించేసి ఉంటాడని నిట్టూర్చింది లక్ష్మి! భర్త విషయంలో ఆమె ఊహించేదంతా నిజమై తీర్తుంది!

అత్తమామలు పడ్తున్న బాధలన్నీ కూడా లక్ష్మి గుర్తిస్తూనే వస్తున్నది క్రొత్తల్లుడు కొద్దో గొప్పో కలవారి కుటుంబంలోని మనిషి! వేషభాషలు నాగరికంగా కన్పించినా, వారి కుటుంబమంతా బహు సనాతనాచార పరులు! ఆచార వ్యవహారాలన్నీ 'తూచా' తప్పకుండా జరిగిస్తుంటేనే వారికి తృప్తి! వారి కాగ్రహంవస్తే ఎవ్వరూ ఆపలేరు .. వారలిగితే ఎవ్వరూ తీర్చలేరు! గొప్పింటి సంబంధమని మురిసిపోయిన వారికి ఆ పెళ్లి దినాల్లోనే అవన్నీ అనుభవానికి వచ్చేశాయ్! అందుకనే ఈ సంక్రాంతి పండుగ దగ్గరకొస్తుంటే అత్తా

కూతు లింత కంగారుపడటం!... ఇదంతా కూడా లక్ష్మి గమనిస్తూనే వచ్చింది!

ఒకనాటి రాత్రి తనకు పెళ్లైన తరువాత ఇలాంటి పంగుగల వ్యవహారాలకి తన భర్తతోసహాని తన తల్లిదండ్రు లెన్ని బాధ లనుభవించారో - అదంతా నెమరేసుకొన్నది లక్ష్మి! ప్రస్తుతం ఈ పంగుగకి క్రొత్తగా పెళ్లైన తన చెల్లెలి భర్తకొరకని తిరిగి వా రెంత కష్టపడుతున్నారో - అదంతా తలపోసు కొన్నది ఇప్పుడు తన అత్తామామలు క్రొత్తల్లుడి గురించి ఎంత వ్యగ్ర చెందుతున్నారో - అదంతా స్ఫురణకి తెచ్చుకొం





# వాటర్‌బరీస్ కాంపౌండ్

## మీకు అధికమైనశక్తినిచ్చును... త్వరితముగా!



జీవితములో ఆపాదించు రుగ్మతలను మీ పిల్లలు ఎదుర్కొని తట్టుకొనుటకు సహాయపడును. ఆరోగ్యమునిచ్చు టానిక్ అని రుజువుచేయబడిన వాటర్ బరీస్ కాంపౌండు వారికి బలము చేకూర్చును.

విధివిరామము లేక ఆటపాటలతో అలసిపోవు పిల్లలకు ఇంపితమైన వాటర్ బరీస్ కాంపౌండును ప్రతి దినము వాడినచో అధికమైన శక్తినిచ్చును అంతేగాక వాటర్ బరీస్ కాంపౌండు దగ్గును జలుబును చేరనీయక రక్షించును వారి ఆహారమునకు తోడుగా పనిచేసి, దృఢకాయులుగా యుండుటకు మంచి పోషణనిచ్చును ప్రతి దినము ఆటపాటలకు తగినంత పుష్టినిగూడా చేకూర్చును

వాటర్ బరీస్ కాంపౌండు మీ పిల్లలకు అధికమైన శక్తినిచ్చును మీ కుటుంబమున కంతటికి ఆరోగ్యమును ప్రసాదించు టానిక్ అని రుజువు చేయబడినది!




ఉత్సాహముగా వుండుటకు, మీకు ఆరోగ్యమునిచ్చు

# వాటర్ బరీస్ కాంపౌండును

సేవింపుడు.

NAS 268

# ఆమె అభిప్రాయం

దామె! అటు-తన చెల్లెలి అత్తమామలూ, తన ఆడుబిడ్డ అత్తమామలు సైతం వారివారి కన్న బిడ్డల్లో పెళ్ళిళ్ళైన ఆడుబిడ్డల గురించి ఎంత శ్రమ లనుభవిస్తున్నారో - అదంతా కూడా ఊహించుకొన్నది .

తన తల్లిదండ్రు లవనీ, తన అత్తమామ లవనీ, తన ఆడబిడ్డ అత్తమామ లవనీ, తన చెల్లెలి అత్తమామ లవనీ-ఎవరైతేనేమి? ఆడ బిడ్డల్ని కన్నవా రందరిదీ ఒకటే గాథ; అందరికీ ఒకటే బాధ - అంతేగదా! అన్పించిం దామెకు!! గాఢంగా నిట్టూరుస్తూ నిద్రరాక అటూ ఇటూ పొర్లుతూ చాలసేపు బాధపడిందామె!

తెల్లవారింది ప్రొద్దెక్కుతూ వుంది!. పాత అప్పులవాళ్లు ఇంక అప్పులివ్వరు కనుక క్రొత్త అప్పులవారి నెవరినైనా వెతుక్కొని అప్పుడు క్రొత్తల్లుడికి సంక్రాంతి ఆహ్వానం పంపాలని తుదినిర్ణయాని కొచ్చి వెంకటరావుగారు, దేవుడిని - ఆ అప్పుఇచ్చేవారి నైనా త్వరలో చూపించాల్సిందని ప్రార్థించే నిమిత్తం పూజగదిలోకి వెళ్ళారు! .

అక్కడ లక్ష్మి ధ్యాన నిమగ్నయై నిలబడి వుంది! ఆమె సరసనే మౌనంగా నిలబడి పోయారు వెంకటరావుగారు కొన్ని క్షణాలకి లక్ష్మి కళ్లుతెరిచి ప్రక్కకి తిరిగి చూచింది, ప్రక్కనే మామగారు!

భగవంతునికని జోడించిన తన రెండు చేతుల్నీ మెల్లగా మామగారి చేతుల కందించింది! వెంటనే ఆమె మృదుహస్తాలను ఆదరంతో యథాలాపంగా అందుకొన్నా డాయన! ఆయన అంజలిలో ఆమె ముకుళిత హస్తాలు తెరువబడ్డాయి! ఆ వెంటనే ఆ చేతులలో ఏదో వస్తు వుంచబడ్డట్టు వెంకటరావుగారికి స్పర్శ కల్గింది! విస్మయంతో ఆయన దాన్ని చూచుకొన్నారు—అది లక్ష్మి బంగారు నల్లపూసల గొలుసు!......

దిగ్భ్రాంతి చెందా డాయన!.

"అమ్మా! ఇదేమిటమ్మా?" అన్నా డాయన తేరుకొని!. ఆమె మెళ్ళో క్రొత్త నల్లపూసలత్రాడు, పసుపుత్రాడు ఆమెకో విచిత్ర శోభ చేకూరుస్తూ కన్పించాయ్!

ఆమెకూడా చాలాసేపటివరకూ తేరుకోలేకపోయింది! చివరికి గద్గద కంఠంతో ఇలా అంది—"ఏముందండీ - ఏమీ లేదు! కాని, మీరు దీన్ని నిస్సంకోచంగా పట్టుకెళ్లి, ఏదో ఒకటి చేసి - అమ్మాయిని అతన్ని పండుగకి రమ్మని నిశ్చింతగా ఉత్తరం వ్రాసి రండి, ముందు!"

"అయ్యో! ఇదేమిటమ్మా? నే నలా చేయలేను. ఊహుఁ! నావల్ల కాదమ్మా!" అన్నా డాయన తొట్రుపడ్తూ.

నీరసమైన మందహాసంతో "అబ్బే! మీరలా బాధపడితే ఎలాగండీ? నా కంతా తెల్సు - ఎవరైతే నేమండీ, ఆడబిడ్డల్ని కన్నవారందరికీ ఒకేమోస్తరు పరిస్థితు లెదురౌతాయ్! అంతేగదా—" అంటుంటే ఆమె కళ్లు అప్రయత్నంగా చెమ్మగిల్లాయ్! చటుక్కున ముఖం చాటుచేసుకొని "అంతే కాదు - ఆడది కూతురుగా బ్రతికినంతకాలమే అందమైనా చందమైనా! ఆ స్థితి దాటిపోతున్నకొద్దీ ఏ ఆడదానికైనా అంతా అయోమయావస్థే కదండీ?.. .. పెద్దమ్మాయ్ ఇంతకాలం మీచాటున ఏ చీకూ చింతా ఎరుగకుండా హాయిగా ఉంది! ఇక ఆ భాగ్యం ఆ పెళ్లితో పోయినట్టే! కనుక నే, ఆఖరుసారిగానైనా ఈ పండుగ పేరుతో మీ ముచ్చటా, ఆమె సరదా తీర్చుకోవడమే కర్తవ్యం. ముందు స్థితిగతులు ఎవరేం చెప్పగలం?" . అన్నదామె!

—బరువెక్కిన గుండెతో - భారంగా అడుగులేస్తూ, లక్ష్మి అటు వంటింట్లోకీ; వెంకటరావుగారు ఇటు వీధిలోకీ నడిచి పోయారు!... ★

# ★ గ్రంథ స్వీకారం ★

## జాగరణ

అసంపూర్తి నవల. మూలం శరత్ బాబు. అనువాదం: చాడేశ్వరీ దేవి, సౌమిత్రి. ప్రచురణ: శ్రీ వ్యాస సారస్వత సమితి, విజయవాడ. 144 పేజీలు. వెల ఒక రూపాయి

సంపాదకులుగాని, రచయిత గాని తమ ప్రచురణకో రచనకో తొలిమాటలు చెపుతూ తమ అభిప్రాయాలను పాఠకులకు తెలుపుతూ ఉంటారు. ఈ పుస్తకంలో సంపాదకులు కొన్ని అభిప్రాయాలు వెలువరించారు. నాటి దృష్ట్యా పుస్తకాన్ని పరిశీలించటం వేరుబబు కాదు

ఈనాడు తెలుగులోవస్తున్న శరత్ గ్రంథానువాదాలు ఘోరంగా ఉంటున్నాయనీ మనకు ఆయనమీదున్న గౌరవాన్ని అభిమానాన్ని పూర్తిగా తీసివేస్తున్నాయని, వివరిస్తూ ఇది నిజంగా క్షమించదగింది కాదేమో! అని సంపాదకులు చెప్పారు. ఇందులో సందేహం ఎంతమాత్రం అక్కరలేదు. అయితే తాము ప్రచురించిన ఈ అనువాదంకూడా అటువంటి తెగకు చెందినదే అన్న విషయం మాత్రంసంపాదకులుగుర్తించవలసిఉంటుంది.

సంపాదకులు ఆదినుంచి తుదిదాకా ఈ అనువాదాన్ని మరొక్కసారి చదువుకుంటే, ఇది ఎంత ఘోరంగా ఉన్నదో తెలియకపోదు ఉదాహరణకి ఇవి చాలును: "పాత భవనపు హద్దులో, ఫ్యాషన్‌బుల్ గల ఈ బిల్డింగు తయారైంది" "రాధా మాధవరాయ్ ఈ విజాతీయ నవీన పద్ధతులకి పూర్తిగా ఆకర్షించబడ్డి అందులో నిమగ్నుడకూడా, అంటే అదీ కనిపించదు" "నిర్భయపద్ధ శాంత తపస్వి" "రెండు నిమిషాల తర్వాత బైటికి పోయే బట్టలతో ఒక యువతిరే మహాశయుడి ముందునించి సాగిపోయింది. ఆమె ఛాయ ఏమంత యెర్రగా లేదు"

## సమర్పణ

కథలసంపుటి. రచన: 'అమరేంద్ర ప్రతులకు: జనరల్ ప్రింటర్సు, గుంటూరు-2 98 పేజీలు: వెల ఒక రూపాయి.

ఈసంపుటిలో పూర్ణయాత్ర, సమర్పణ, రాలినపువ్వులు, ఎదురుగాలి, వైతరణి, మామ్మగారిదినచర్య, చిరవగుడు, సంజదీపం అనే ఎనిమిది చిన్నకథలు ఉన్నాయి కథ తమకు కాలక్షేపం కాదని, తోటిజీవుల మనోవ్యథలకి రూపం ఇవ్వటంకోసమే కథలు వ్రాస్తామని రచయిత చెప్పారు ఈ ఆశయం కథలలో ప్రతిఫలిస్తున్నది.

## సంస్కృతి

సారస్వత వైజ్ఞానికపత్రిక, అధిపతి: నాగేశ్వర రావు సరస్వతీ పవర్ ప్రెస్, రాజమహేంద్రవరం వారి ప్రచురణ.

సంస్కృతి పత్రిక 2 వ సంపుటి 11 వ సంచిక జనవరిలో వెలువడింది. ఆలూరి కుప్పవార్యుని "పార్థసారథి విజయము" అముద్రిత యక్షగానంగురించి శ్రీయస్వీజోగారావుగారి వ్యాసము, భరతముని ప్రణీత "నాట్యశాస్త్రము" నకు శ్రీపోణంగి శ్రీరామఅప్పారావుగారి అనువాదము ఇందులోఉన్నాయి ఈఅనువాదం ధారావాహికగా ప్రచురింపబడుతున్నది. ఇవికాక ఇతరపద్యాలు వ్యాసాలుకూడా ఉన్నాయి